క్లుప్తంగా

సమసమాజ నిర్మాణానికే కులగణన

- సర్వేకు ప్రజలు సహకరించాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్రంలో సమసమాజ నిర్మాణానికే రాష్ట్ర ప్రభుత్వం కులగణన సర్వే చేపడుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కేఎల్లార్ అన్నారు. ఆదివారం పుర పరిధిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి చేపట్టే సర్వేకు నియోజకవర్గ ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా అన్ని కులాల వారికి న్యాయం జరుగుతుందని వెల్లడించారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేంద్రరెడ్డి ప్రారంభించనున్నారని సీఈఓ యాదగిరిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ క్వింటాల్‌కు రూ.2320, కామన్ గ్రేడ్ క్వింటాకు రూ.2300, సన్న రకానికి రూ.500 బోనస్ చొప్పున సేకరించనున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని, మద్దతు ధర పొందాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఎల్.వి. సత్యనారాయణ తెలిపారు. ఆర్.ఆర్. మసాల మెయిన్‌రోడ్డు, జల్‌పల్లి బుగ్గ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కలిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: శివగంగ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లకొమ్మల తొలిగించే క్రమంలో మహేశ్వరం, తుమ్మలూరు, సిరిగిరిపురం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ చక్రపాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో పూజలు



అమరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేట శివారు ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు, పీసీసీ కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సిల్వేరీ సాంబశివ, ఉపాధ్యక్షుడు జిట్టరాజు, తోట్ల శ్రీనివాస్, కోలేటి నర్సింహారావు, కొమ్ము మల్లేశ్, కిరణ్‌కుమార్, దేవేందర్, శంకర్ తదితరులు ఆయనను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఏడీఈ శంకర్



తుక్కుగూడలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

తుక్కుగూడ: మామిడిపల్లి డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఏడీఈ శంకర్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని ఆ శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి డివిజన్ వ్యాప్తంగా 27 ఫిర్యాదులను స్వీకరించామన్నారు. త్వరలో వీటిని పరిష్కారిస్తామని, తమ సిబ్బంది ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఈ చక్రపాణి, బాలాపూర్ ఏఈ రాజు, కందుకూరు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, జేఏఓ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బకాయి చెల్లిస్తారా.. ఆస్తి జప్తు చేయమంటారా?



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

రైతులకు సహకార బ్యాంకు లీగల్ నోటీసులు

- గడువులోగా పీఏసీఎస్‌లో జమచేయాలంటూ ఆదేశం
- 15 ఏళ్లుగా 326 మంది వద్ద పేరుకుపోయిన రూ.6.50 కోట్లు

యాచారం: మొండి బకాయిదారుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేసేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిద్ధమయింది. ఈ నెల 13వ తేదీలోగా బకాయి మొత్తం యాచారం పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో చెల్లించాలని సెక్షన్–71(1) హెచ్చరిక నోటీసులు జారీ చేసింది. చెల్లింపుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం, జాప్యం చేసినా దీర్ఘకాలిక రుణాలు పొందిన సమయంలో తనఖా పెట్టిన వ్యవసాయ పొలాలను వేలం వేసి, బకాయి కింద జమచేసుకుంటామని పేర్కొంది.

ప్రాదేయపడినా స్పందన శూన్యం

మండల పరిధి 24 గ్రామాల్లో 15 ఏళ్ల కాలంలో 2,308 మంది రైతులు పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు, గొర్రెలు, మేకల పెంపకానికి తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టి రూ.41 కోట్ల దీర్ఘకాలిక రుణాలు పొందారు. 1,982 మంది ఏటా గడువు లోపు బకాయి చెల్లిస్తున్నారు. చెల్లించని వారిని హెచ్చరిస్తూ.. పలుమార్లు పీఏసీఎస్ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. అయినప్పటికీ.. వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో పీఏసీఎస్, రికవరీ అధికారులు రుణాలు పొందిన రైతుల వద్దకు వెళ్లి.. బకాయిలు చెల్లించాలని ప్రాదేయపడ్డారు. అయినా ముందుకు రాలేదు. దీంతో చేసేదేమీ లేక.. పీఏసీఎస్ అధికారులు జిల్లా బ్యాంకు ఉన్నతాధికారులకు లీగల్ చర్యలకు నివేదిక పంపించారు. దీని ఆధారంగా బకాయిదారులకు తాజాగా బ్యాంకు జాయింట్ రిజిస్ట్రార్ చట్టపరమైన చర్యలకు ఉపక్రమించింది.

గడువులోగా చెల్లిస్తే చర్యలు ఉండవు



పదేళ్ల కిందట దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు.. నేటికీ పైసా చెల్లించలేదు. బకాయి చెల్లించాలని ప్రాదేయపడ్డాం. అయినా వారిలో స్పందన రాలేదు. తీసుకున్న రుణం చెల్లిస్తేనే.. మిగతా రైతులకు రుణాలు అందజేసే అవకాశం ఉంది. 326 మంది నుంచి రూ.6 కోట్ల రావలసి ఉంది. వీరికి సహకార కేంద్ర బ్యాంకు నుంచి లీగల్ నోటీసులు వచ్చాయి. గడువులోగా చెల్లిస్తే.. చట్టపరమైన చర్యలు ఉండకపోవచ్చు.

– తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, చైర్మన్ పీఏసీఎస్, యాచారం

పదేళ్లుగా పైసా చెల్లించని వారికే..

పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొంది, 15 ఏళ్లుగా పైసా చెల్లించని 326 మంది మొండి బకాయిదారులైన రైతులకు నోటీసులు జారీ అయ్యాయి. వీరి నుంచి రూ.6.50 కోట్లు రావలసి ఉంది. ఆస్తులు తనఖా పెట్టి, రుణం పొందిన నాటి నుంచి నేటి వరకు వడ్డీతో కలిపి పెద్ద మొత్తంలో బకాయి పేరుకుపోయింది. బకాయి వసూలు చేయాలని బ్యాంకు ఉన్నతాధికారులు.. రికవరీ సిబ్బందిపై ఒత్తిళ్లు తెచ్చారు. ఉద్యోగాలు తొలగిస్తామని హెచ్చరించారు. వారి ఒత్తిళ్లను తట్టుకోలేని రికవరీ అధికారులు.. చట్టపరమైన చర్యలకు దిగారు. సెక్షన్–71(1) లీగల్ నోటీసులు జారీ చేశారు. ఇచ్చిన గడువులోగా బకాయి చెల్లించాలని, లేని పక్షంలో తనఖా పెట్టిన ఆస్తులను జప్తు చేసి, బకాయి కింద జమ చేసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.


GOVERNMENT OF TELANGANA
COOPERATION DEPARTMENT

ఓ రైతుకు ఇచ్చిన నోటీసు

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

- నాణ్యతతో కూడిన సేవలు అందిస్తాం
- వినియోగదారుల సదస్సులో ఏడీఈ శంకర్
- ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

మహేశ్వరం: విద్యుత్ వినియోగదారులకు నాణ్యతతో కూడిన సేవలు అందించేందుకు తాము కృషి చేస్తున్నామని ఏడీఈ శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సదస్సును నిర్వహించారు. అనంతరం వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. రైతుల పంట పొలాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తామని పేర్కొన్నారు. శిథిల విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు విద్యుత్ వినియోగదారుల సదస్సులో మహేశ్వరం–8, బాలాపూర్–8, పహాడీషరీఫ్–6, కందుకూరు–5 మొత్తం 27 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ విద్యుత్ ఏఈలు చక్రపాణి, రాజు, వేణుగోపాల్‌రెడ్డి, జేఏఓ భాస్కర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కందుకూరు: మండల పరిధి పులిమామిడి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న బాల్య మిత్రులు ఆదివారం సందడి చేశారు. ఓ రిసార్టు వేదికగా ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ.. కేరింతలు కొట్టారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేద ప్రజలకు వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి పల్లెచెలక తండాకు చెందిన విస్లావత్ రాజు నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు అధికమవడంతో.. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్‌ఓసీని గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు రమేశ్‌కు అందజేశారు. కార్యక్రమలో తండా నాయకులు బాల్దాస్ నాయక్, నందునాయక్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధి పటేల్ చెరువుతండాలో గ్రామ పంచాయతీకి వీధి లైట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి నిధుల నుంచి కేటాయించిన రూ.27లక్షలతో మండలంలో 756 వీధిలైట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజల తరుపున ఎంపీకి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆరుట్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్, నాయకులు రాజు నాయక్, గుడ్డిమల్ల చంద్రయ్య, ధర్మ నాయక్, శంకర్, కిషన్‌నాయక్, జవహర్ లాల్, సాగర్, రవి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



వీధి లైట్లను ప్రదర్శిస్తున్న నాయకులు, స్థానికులు

ఆలయాల అభివృద్ధికి కృషి



సంపు పనులను పరిశీలిస్తున్న నాయకులు

తుక్కుగూడ: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. ఆదివారం జిన్నాయిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్నమంచినీటి సంపు నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా జిన్నాయిగుట్ట రోడ్డుకు మరమ్మతు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వై.శివకుమార్, బి.యాదగిరిరెడ్డి, ఆర్.రాజు, నాయకులు సుధాకర్, శివయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా అవగాహన

బోసిపోయిన విద్యుత్ వినియోగదారుల వేదిక

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారుల అవగాహన కార్యక్రమం నామమాత్రంగా జరిగింది. ఆదివారం ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్‌లో.. విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన మెలుకువలు, ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు, నాణ్యత గల వైర్లు వాడకం, ఎర్తింగ్ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. సుమారు పదిమంది వినియోగదారులు రాకపోవడం గమనార్హం. దీనికి కారణం.. ముందస్తుగా గ్రామాల్లో చాటింపు చేయకపోవడమేనన్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం సమావేశం నిర్వహించి చేతులు దులుపుకొన్నారు కానీ.. దీని వలన వినియోగదారులకు ఒరిగిందేమీలేదని పలువురు అభిప్రాయం వ్యక్తంచేశారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

శబరిమలకు భక్తుల పాదయాత్ర

మహేశ్వరం: అయ్యప్ప భక్తులు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం మండల పరిధి మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భక్తులు.. తొలుత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ భూమి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రకు వెళ్లేముందు.. ఆలయంలో అయ్యప్ప స్వామికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, అమృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు వినయ్, వసంత్, కోటాచారి, అశోక్ చారి పలువురు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప భక్తులు

పుష్కరకాలం దాటినా మారని దశ

కాలనీలు ఏర్పడి పుష్కరకాలం దాటినా.. కనీస సౌకర్యాల లేమితో కొటుమిట్టాడుతున్నాయి. నివాసాలు విస్తృతం అయ్యాయి. కాలనీలు విస్తరించాయి. అందుకు అనుగుణంగా జనాభా పెరిగింది. మున్సిపాలిటీకి పన్నుల రూపంలో ఆదాయం వస్తోంది. కానీ.. ఆయా కాలనీల సంక్షేమం అధికారులు, పాలకులకు పట్టడం లేదని ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నేటికీ నాటి మట్టిరోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థే దిక్కయిందని పేర్కొంటున్నారు.



త్రిశక్తి కాలనీలో మట్టి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

- కనీస సౌకర్యాలకు నోచుకోని కాలనీలు
- పన్నుల చెల్లింపులో ముందు వరుస
- వసతుల ఏర్పాటులో వెనుకబాటు
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కాలనీల దుస్థితి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పురపాలక సంఘం పరిధి పలు కాలనీలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. వసతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మున్సిపాలిటీ ఏర్పడి 12 సంవత్సరాలు దాటినా గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీల కంటే అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పురపాలికగా మారితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధికంగా నిధులు వస్తాయని, అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని భావించిన ప్రజలకు.. వారు చెల్లించే పనులు పెరిగాయే తప్ప.. అభివృద్ధి కానరావడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

బృందావన్, త్రిశక్తి కాలనీ, వ్యవసాయ మార్కెట్ వెనుక భాగం, సాయినగర్, వివేకానందనగర్, భాగ్యనగర్, న్యూ చైతన్యతో పాటు పలు కాలనీలకు మట్టిరోడ్లే దిక్కయ్యాయి. దీంతో వర్షాకాలంలో బురదమయం తలపిస్తే.. మిగతా కాలాల్లో దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నామని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో.. మురుగు జలాలు మట్టి రోడ్లపై ప్రవహిస్తూ తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. కొత్తగా నిర్మాణాలు చేపట్టే సందర్భంలో అనుమతి, బెటర్‌మెంట్ పేరిట చార్జీలు, ఆస్తి పన్ను మున్సిపాలిటీకి చెల్లిస్తున్నా.. సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపించారు.

జీపీగా ఉన్నప్పుడే నయం

గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే నిర్మాణ, ఇంటి టాక్స్‌లు తక్కువగా ఉండేవని, మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత అధికారులు.. పన్నుల రూపేణా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారే తప్ప, సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అప్పట్లో గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తిరిగి సమస్యలను తెలుసుకునేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎన్నికలు సమయంలో ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రజలు గుర్తుకు వస్తున్నారని, అనంతరం ఎవరూ కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.



మార్కెట్ వెనుక కాలనీ మట్టి రోడ్డు

స్థితిగతులు మారడం లేదు



పాలకులు, అధికారులు మారుతున్నారు. కానీ కాలనీల స్థితిగతులు మారడం లేదు. అవే మట్టిరోడ్లు, దుమ్ముధూళితో అవస్థ పడుతున్నాము. మున్సిపాలిటీకి వివిధ రూపాల్లో పనులు చెల్లిస్తున్నాము. అయినా కాలనీల్లో వసతులు కల్పించడం లేదు.

– పురుషోత్తం, త్రిశక్తి కాలనీ ప్రధాన కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

అడిగితే నోరు మెదపరు



పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ.. పుర సిబ్బందికి కాలనీల సంక్షేమం పట్టదు. వర్షం వస్తే మట్టి, గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్నాం. పదేళ్ల క్రితం కాలనీలో ఇల్లు కట్టుకున్నాం. ఇప్పటి వరకు సీసీరోడ్లు వేయలేదు. పన్ను చెల్లించాలంటూ మొండిగా వ్యవహరిస్తారు. సౌకర్యాలు అడిగితే నోరుమెదపరు.

– నిఖిల్, బృందావన్ కాలనీ, ఇబ్రహీంపట్నం

దశలవారీగా అభివృద్ధి చేస్తాం..



దశలవారీగా వివిధ కాలనీలను అభివృద్ధి పరుస్తాం. సీసీరోడ్లకు ప్రతిపాదనలు పెట్టాం. కొత్త, పాత బస్తీల్లో బడ్జెట్‌ను బట్టి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం. వీలైనంత త్వరలో అన్ని కాలనీల్లో మట్టి రోడ్లను.. సీసీలుగా తీర్చిదిద్దుతాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

అర్హతలున్నా గుర్తించడం లేదు

- గట్టుఇప్పలపల్లి మండల కేంద్రం సాధించే వరకు పోరాటం
- జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్
- కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా చేయడానికి అన్ని వనరులు ఉన్నాయని, అయినా ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో గ్రామం పెద్దదని పేర్కొన్నారు. గతంలో రెండు పర్యాయాలు సుమారు 140 రోజుల పాటు నిరసనలు, రిలే నిరహార దీక్షలు చేపట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా.. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఎదుల శరత్‌చంద్ర, వెంకటయ్య, రమేష్, నాగయ్య గౌడ్, నరసింహ గౌడ్, చంద్రయ్య, జంగయ్య, ఇదమయ్య, వెంకయ్య, రామకృష్ణ, బాల్ జంగయ్య, కృష్ణాజి, బాలయ్య, లక్ష్మణ్ నాయక్, భీమ్లా నాయక్, దేవోజి, గోవింద్ జంగయ్య, గౌస్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

ఘనంగా గ్యార్మీషరీఫ్ వేడుకలు

ఆమనగల్లు: గ్యార్మీషరీఫ్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలు గ్యార్మీషరీఫ్ జెండాతో భారీ ఊరేగింపు తీశారు. అనంతరం పట్టణంలోని మౌలాలిపహాడ్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హజ్రత్ సయ్యద్ జహర్దిన్‌షా ఖాద్రి సందేశం ఇచ్చారు. తదనంతరం మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ నివాసంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ కరీం, గౌస్ మైనొద్దీన్, మహ్మద్‌సిరాజ్, మహ్మద్‌హబీబ్, సయ్యద్ అఫ్రిది, సయ్యద్ ఫర్దీన్, సయ్యద్ ఇర్ఫాన్, మహబూబ్, అహ్మద్, అక్బర్, మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.